క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

దెందులూరు: దెందులూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం సాయంత్రం 4 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.శ్రీలత తెలిపారు. ఎంపీటీసీలు, అన్ని శాఖల మండలాధికారులు, సమావేశానికి హాజరుకావాలని ఎంపీడీఓ పేర్కొన్నారు.

కలెక్టర్ వెంకటేష్‌కు అభినందనలు



కలెక్టర్‌కు అభినందనలు తెలుపుతున్న మానవత ఏలూరు యూనిట్

ఏలూరు(మెట్రో) : స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి వె.ప్రసన్న వెంకటేష్‌ను మానవత ఏలూరు యూనిట్ బుధవారం కలిసి అభినందనలు తెలిపారు. ఏలూరు జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రారంభం నుంచి యంత్రాంగాన్ని అప్రమత్తంచేసి ప్రభుత్వ అధికారులకు మార్గదర్శకాలిస్తూ పోలింగ్ ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించినందుకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను అభినందించామని మానవత ఏలూరు యూనిట్ అధ్యక్షుడు మేతర అజయ్ బాబు తెలిపారు. కార్యక్రమంలో మానవత ఏలూరు యూనిట్ రీజనల్ చైర్మన్ పోలవరపు దేవ రత్నాకరరావు, యూనిట్ చైర్ పర్సన్ అడుగుమిల్లి నిర్మల, సభ్యులు అల్లూరి మోహిని, మేడికొండ పద్మజ, డి.భారతి, వై.విష్ణు, అగ్గాల కోహాదిం తదితరులు ఉన్నారు.

ఫాతిమా మాత టవర్ పండుగ



సందేశమిస్తున్న ఫాదర్లు బాల, మైఖేల్

దెందులూరు : పునీత మదర్ థెరిస్సా 27వ విచారణ మహోత్సవాలు ఫాతిమా మాత టవర్ పండుగ వేడుకలు బుధవారం వంగాయగూడెంలో ఫాదర్ జిజ్జువరపు మైఖేల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఆర్‌సీఎం ఏలూరు వికార్ జనరల్ డాక్టర్ ఫాదర్ పి.బాల, ఏలూరు కెథ్రడల్ చర్చి ఫాదర్ ఐ.మైఖేల్ పునీత మదర్ థెరిస్సా స్ఫూర్తితో ప్రేమ, సేవ, శాంతి గుణాలను కలిగిఉండి సమాజంలో విస్తరింపజేయాలన్నారు. దేవుని ఆజ్ఞలకు లోబడి ప్రతిఒక్కరూ నిత్య ప్రార్థనల్లో భాగస్వాములు కావాలని కోరారు. ప్రతి ఏటా ఫాతిమా మాత టవర్ పండుగ మదర్‌థెరిస్సా మహోత్సవాలు వైభవంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. విచారణ గురువులు మైఖేల్, ముఖ్యఅతిథులు ఫాదర్ బాల, ఫాదర్ మైఖేల్‌ను సత్కరించారు. వేడుకల్లో పెదపాడు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ జాకబ్, ఫాదర్ జోసెఫ్, సంఘస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని రామచంద్ర అటానమస్ ఇంజినీరింగ్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో చేరే విద్యార్థులకు రూ.50 లక్షల స్కాలర్‌షిప్‌లు అందించనున్నట్లు ఆ కళాశాల ఎకడమిక్ డీన్ ఎస్ సుబ్రహ్మణ్య శర్మ తెలిపారు. బుధవారం కళాశాలలో ఆయన మాట్లాడారు. గంటా శ్రీరామచంద్రరావు ట్రస్ట్ ద్వారా కళాశాల చైర్మన్ కొరపాటి వేణుగోపాల్, మేనేజింగ్ డైరెక్టర్ సాయి రోహిత్‌లు ఈ స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా స్కాలర్‌షిప్ వివరాలతో ఉన్న పోస్టర్లను విడుదల చేశారు. కళాశాల ప్లేస్‌మెంట్స్ డీన్ ఎ.చిరంజీవి, ఇంటర్నల్ ఎఫైర్స్ డీన్ బి.ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ద్వారకాతిరుమల: ఆనాటి ఆ స్నేహమానంద గీతం.. ఆ జ్ఞాపకాలన్నీ మధురాతి మధురం.. అని ఆ పూర్వ విద్యార్థులు అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. 21 సంవత్సరాల క్రితం కలిసి చదువుకున్న విద్యార్థులు మళ్లీ అదే పాఠశాలలో కలిసి సందడి చేశారు. ఇందుకు ద్వారకాతిరుమల శ్రీవారి దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాల వేదికయ్యింది. దాంతో ఆ ప్రాంతంలో పండుగ వాతావరణం కనిపించింది. 2002–2003 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆ నాటి మధుర స్మృతులు, చేసిన అల్లరిని గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని సందడి చేశారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులు ఐవీఎస్‌కే ప్రసాద్, సుబ్బరాజు, సిబ్బంది గోపాలకృష్ణ, రామ్మోహన్‌రావులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఆ తరువాత జరిగిన విందు, సాంస్కృతిక కార్యక్రమాల్లో వారంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రస్తుతం పాఠశాలలో చదివే విద్యార్థుల సౌకర్యార్థం వైర్‌లెస్ మైక్ సెట్‌ను వారు బహుకరించారు. ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేసిన పూర్వ విద్యార్థులు శివన్నారాయణ, బలరామ్, ఎం.దుర్గ, వి.కల్యాణి, వై.నారాయణమూర్తి, ఎం.నారాయణమూర్తి, ఆదిత్య జగన్నాథ్, కె.నాగవిజయ్, పి.నాగరాజు పాల్గొన్నారు.

ఉంగుటూరులో పెరిగిన పోలింగ్ శాతం



సార్వత్రిక ఎన్నికల్లో భీమడోలులో క్యూ కట్టిన మహిళా ఓటర్లు (ఫైల్)

మండలాల వారీగా ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
భీమడోలు	25,778	27,154	01	52933
ఉంగుటూరు	31402	32559	05	63966
నిడమర్రు	18673	18835	నిల్	37508
గణపవరం	25692	26338	నిల్	52030

పోలైన ఓట్ల వివరాలు..

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	శాతం
భీమడోలు	22768	23414	01	46183	87.248
ఉంగుటూరు	28399	28701	04	57104	89.272
నిడమర్రు	16843	16397	నిల్	33240	88.621
గణపవరం	22466	22159	నిల్	44625	85.768

భీమడోలు : ఈనెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఉంగుటూరు నియోజకవర్గంలో 87.752 శాతం పోలింగ్ నమోదై రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. నియోజకవర్గంలోని భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాల ఓటర్లు ఉదయం 6 గంటల నుంచి పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.రాత్రి వరకు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత ఎన్నికలతో పోల్చితే ఈ శాతం పెరిగింది. నియోజకవర్గంలో 214 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2,06,437 ఓటర్లలో పురుషులు 1,01,545 మంది, మహిళా ఓటర్లు 1,04,886 మంది, ఆరుగురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 90,476 మంది, మహిళలు 90,671 మంది, ట్రాన్స్‌జండర్లు ఐదుగురు ఓటు హక్కును వినియోగించుకున్నారని అధికారులు బుధవారం రాత్రి తెలిపారు.

గెలుపుపై ఎవరి ధీమా వారిది

సార్వత్రిక ఎన్నికల్లో మహిళలు, వృద్ధులు, బడుగు, మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీ ప్రజలు అధిక సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సంక్షేమ పథకాల ప్రదాత జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి పట్టం కట్టేందుకు పెద్ద ఎత్తున ఓటర్లు ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ కట్టారు. ఇది ప్రభుత్వ సానుకూలతేనని వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రభుత్వ వ్యతిరేకతకు నిదర్శనమని కూటమి నేతలు చెబుతున్నారు. రాజకీయ విశ్లేషకులు, సర్వేలు వైఎస్సార్ సీపీకే అనుకూలంగా చెబుతున్నారు.

ముమ్మరంగా ఉపాధి హామీ పనులు



కవ్వగుంటలో ఉపాధి పనులు నిర్వహిస్తున్న కూలీలు

పెదవేగి : ఉపాధి హామీ పనులు పెదవేగి మండలంలో ముమ్మరంగా సాగుతున్నాయి. 30 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు నిర్వహిస్తున్నారు. కవ్వగుంటలో నిర్వహిస్తున్న పనులను పరిశీలించిన ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ హేమలత మాట్లాడుతూ సాంకేతిక సహాయకులు సూచించిన విధంగా పనులు చేస్తే, కనీస వేతనం అందుతుందని చెప్పారు. ఎంత పనిచేస్తే అంత కూలి వస్తుందన్నారు. చెరువులో పనిచేసే సమయంలో దూరాన్ని బట్టి కూలి ధర ఉంటుందన్నారు. పనిచేసే ప్రదేశంలో ఖచ్చితంగా నీడను ఏర్పాటు చేయాలని, మజ్జిగను అందించాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని క్షేత్ర సహాయకులు, మేట్‌లకు సూచించారు. ఎండ తీవ్రత పెరిగే సమయానికి పనులు పూర్తిచేయాలన్నారు.

కాటన్ సేవలు చిరస్మరణీయం



భీమడోలు : కాటన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సుధాకర్, చిన్నారులు



కొవ్వలిలో కాటన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సొసైటీ చైర్మన్ రాము

భీమడోలు: గోదావరి ప్రజలు పాలిట అపరభగీరధుడు సర్ ఆర్థర్ కాటన్ అని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సర్ ఆర్థర్ కాటన్ 122వ జయంతిని పురస్కరించుకుని బుధవారం గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సుధాకర్ మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల ప్రజలు క్షామంతో తీవ్ర ఇబ్బందులు పడుతుండగా బ్రిటిష్ రాజ్యానికి చెందిన ఇరిగేషన్ ఇంజినీర్ కాటన్ గోదావరి కాలువపై ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మించి ఈ ప్రాంత ప్రజలకు తాగు, సాగునీటిని అందించిన మహనీయుడన్నారు. ఆయన సేవలు మరవలేనివని చెప్పారు. ఉభయగోదావరి జిల్లాలు అన్నపూర్ణగా మార్చిన మహోన్నత వ్యక్తి, డెల్టా ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసి ప్రతి ఒక్కరి గుండెల్లో కొలువై ఉన్నాడని తెలిపారు. చిన్నారులు వేసవి సెలవుల్లో గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని చక్కని విజ్ఞానాన్ని పొందాలని సుధాకర్ సూచించారు. గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జూన్ 7వ తేదీ వరకు శిక్షణ తరగతులు కొనసాగుతాయని, వీటిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. తొలుత చిన్నారులు నీతి కథలు చదివి, వాటి సమీక్షలు రాశారు. ఆటలు ఆడారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల చిన్నారులు పాల్గొన్నారు.

అపరభగీరధుడు సర్ ఆర్థర్ కాటన్

దెందులూరు: జలమే భారతావని బలమని చెప్పి అపరభగీరధుడు జనరల్ సర్ ఆర్థర్ కాటన్ అని కొవ్వలి కోపరేటివ్ సొసైటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నేత కొమ్మిన రాము అన్నారు. బుధవారం కాటన్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మించి ఉభయగోదావరి జిల్లాలకు సాగు, తాగునీటి సమస్య శాశ్వతంగా లేకుండా చేసిన గొప్ప మహనీయుడని రాము వివరించారు. చరిత్ర ఉన్నంతకాలం ఆయన ఉభయగోదావరి జిల్లాలకు చేసిన ఖ్యాతి, ఆనకట్ట నిర్మాణం, గుర్తు ఉంటుందని చెప్పారు.

వైఎస్సార్ సీపీ శ్రేణులకు కృతజ్ఞతలు



నాయకులతో మాట్లాడుతున్న అబ్బయ్యచౌదరి, రామచంద్రరావు

దెందులూరు / పెదవేగి : వైఎస్సార్ సీపీ విజయానికి రేయింబవళ్లు శ్రమించిన వైఎస్సార్ సీపీ అన్ని విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం దెందులూరు, పెదవేగి మండలం కొండలరావుపాలెంలోని ఎమ్మెల్యే కార్యాలయాల్లో ఆయన మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమం కారణంగా దెందులూరు, ఆంధ్రప్రదేశ్‌లోనూ వైఎస్సార్ సీపీ విజయబావుటా ఎగురవేయటం ఖాయమన్నారు. ఎమ్మెల్యేగా తనకు దెందులూరు నియోజకవర్గంలో అండగా నిలబడి, ప్రతి విషయంలో మద్దతునిచ్చిన ప్రతి ఒక్కరి కృషి, సేవ ఎన్నటికీ మరువనని చెప్పారు. పార్టీ కోసం శ్రమించిన సేవలందించిన నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు తప్పక ఉంటుందని తెలిపారు. విదేశాల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి జగనన్న, తనపై అభిమానంతో నమ్మకంతో ఓటు వేయడానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానన్నారు. రానున్నది జగనన్న ప్రభుత్వమేనని, దెందులూరును ఆంధ్రప్రదేశ్‌లో అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నేత కొఠారు రామచంద్రరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తలసేమియా వ్యాధిపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ కృష్ణారెడ్డి, వైద్యులు

ఏలూరు టౌన్ : ఏలూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో రెడ్‌క్రాస్ ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో విజయవాడ రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ వైద్య బృందంతో తలసేమియా వ్యాధిపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. తలసేమియా బాధిత చిన్నారులు, వారి తల్లిదండ్రులు, బంధువులు హాజరయ్యారు. చిన్నపిల్లల వైద్య నిపుణులు, కన్సల్టెంట్ పీడియాట్రిక్ హెమటో అంకాలజిస్ట్ డాక్టర్ వీణ అక్కినేని మాట్లాడుతూ దేశంలో తలసేమియా కేసులు పెరగటానికి ముఖ్యకారణం ప్రజల్లో వ్యాధి పట్ల సరైన అవగాహన లేకపోవటమే అన్నారు. 6 నెలల నుంచి 18 సంవత్సరాల్లోపు పిల్లలు రక్తహీనతతో బాధపడుతూ ఉంటే వైద్యుల సలహా మేరకు తలసేమియా, హిమోఫిలియా వంటి స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. తలసేమియా పిల్లలకు బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ పరిష్కారం ఉన్నప్పటికీ మ్యాచింగ్ దాత దొరకాలని, ఇది ఖర్చుతో కూడినది కావటంతో స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ సహకారంతో కొందరు బాధితులకు బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్స చేస్తున్నామని వివరించారు. ఏలూరు జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా సుమారు 10 వేల మందికిపైగా తలసేమియా భారినపడుతున్నారని చెప్పారు. ఈ వ్యాధి బాధితులకు జీవితాంతం రక్తమార్పిడి చికిత్స, మందులు వాడాల్సిన పరిస్థితి ఉంటుందని అన్నారు. తలసేమియా చిన్నారులకు రెడ్‌క్రాస్ సొసైటీ అండగా నిలుస్తుందని చెప్పారు. ప్రతి నెలా అనేకమంది తలసేమియా బాధితులకు ఏలూరులో రక్తమార్పిడి చికిత్స అందిస్తున్నామని, అనేక మంది దాతలు సైతం తమవంతు సహకారం అందిస్తున్నారని వివరించారు. తలసేమియా స్క్రీనింగ్ క్యాంపుకు హాజరైన బాధిత చిన్నారులు, వారి తల్లిదండ్రులు 150 మందికి భోజన సదుపాయాన్ని కల్పించిన మానవత విద్యానిధి కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్యులు జేవీ ప్రసాద్‌రెడ్డి, స్పందన, ఆలపాటి వెంకటలక్ష్మీ ప్రసన్న, లావేటి శ్రీను, రెయిన్‌బో ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

రహదారి పచ్చని పందిరి



పినకడిమి – కొప్పాక మార్గంలో పందిరిలా అల్లుకున్న వృక్షాలు

ఉదయం ఎనిమిది గంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపడంతో ప్రజలు అల్లాడుతున్నారు. మండుటెండలో ప్రయాణించే వాహనదారులు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పచ్చని చెట్ల నీడన కొద్దిసేపు సేదదీరాలనుకుంటారు. పెదవేగి మండలం దుగ్గిరాల, పినకడిమి – కొప్పాక రహదారి, స్థానిక బి.శింగవరం – కొప్పాకగూడెం, పెదవేగి – కూచింపూడి రోడ్లకు ఇరువైపులా ఉన్నపచ్చని వృక్షాల కొమ్మలు రోడ్డుపైకి బాగా విస్తరించి ప్రయాణికులు ఎండబారిన పడకుండా గొడుగులా నీడనిస్తున్నాయి. ఈ వృక్షాలు పర్యావరణ పరిరక్షణకు దోహదపడడమేకాక ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. – పెదవేగి



దుగ్గిరాల వద్ద చల్లని నీడనిస్తున్న వృక్షాలు




బి.శింగవరంలో రోడ్డు ఇరువైపులా నీడలిస్తున్న వృక్షాలు

డ్రెయిన్లలో పేరుకుపోయిన చెత్త

దుర్వాసనతో కొత్తపేట వాసుల ఇబ్బందులు

ఏలూరు టౌన్ : ఏలూరు టూటౌన్ కొత్తపేట ప్రాంత మురుగు కాలువ చెత్త, వ్యర్థాలతో నిండిఉంది. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు విజృంభించి స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరపాలక అధికారులు వెంటనే సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు. వర్షాలు, తుఫానులు వస్తే పరిస్థితి మరింత అధ్వానంగా మారనుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు 43వ డివిజన్ ప్రధాన మురుగు కాలువ సమస్యకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో జనాభా తక్కువ ఉండడంతో కాలువ చిన్నగా ఉండేది. ప్రస్తుతం జనాభా పెరిగిపోవటం, మురుగునీరు పారుదలకు వాటర్ పైప్‌లైన్ అడ్డుగా రావటంతో చెత్త, వ్యర్థాలు నిలిచిపోతున్నాయి. రోడ్డు మధ్యంలో కల్వర్టులు సరిగా లేకపోవటంతో మురుగునీటి పారుదలకు చెత్త అడ్డురావటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు చెబుతున్నారు.



కొత్తపేట మురికికాలువలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు

ఇరువైపులా గోడలు కట్టాలి

మురుగునీటి పారుదలకు మధ్యలో పైప్‌లైన్ అడ్డురావటం, కల్వర్టులు చిన్నగా ఉండడంతో చెత్త, వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. వంతెనలు వెడల్పు చేయటంతోపాటు, మురుగునీటి పారుదల సక్రమంగా ఉండేలా గోడలు కడితే సమస్య పరిష్కారం అవుతుంది. వర్షాలు పడితే సమస్య మరింత తీవ్రతరం కానుంది.

– గొంతిన రామకృష్ణ, కొత్తపేట, ఏలూరు

దోమలు, దుర్వాసనతో ఇబ్బంది

మురుగునీటితోపాటు చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు నిలిచిపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు పెరిగిపోవటంతో ఇబ్బందులు పడుతున్నాం. గతంలో తాత్కాలికంగా చెత్తను తొలగించారు, కానీ పూర్తిస్థాయిలో పరిష్కారం చూపించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. చాలామంది అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉంది.

– కర్రి లక్ష్మి, గృహిణి, ఏలూరు